క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

కోటపల్లి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని నేత కానిస్టుడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్ సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్‌కు అందజేశారు. పాఠశాలలో ప్రధానంగా నీటి సమస్య తీవ్రంగా ఉందని కలెక్టర్ విడుదల చేసిన నిధులతో బోరు వేయించినప్పటికీ, మోటార్ బిగించకపోవడంతో విద్యార్థులు నీటిని బకెట్లతో మోసుకురావాల్సిన పరిస్థితి ఉందన్నారు. గతంలో కలెక్టర్ రూ.15.5లక్షలు మంజూరు చేయగా పాఠశాల ఎస్‌వో నిధులను సక్రమంగా వినియోగించకపోవడంతో విద్యార్థులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు నిధులు విడుదల చేసిన నామమాత్రంగా మరమ్మతులు చేయించారని, నూతన మరుగుదొడ్ల నిర్మాణం జరిగినప్పటికీ ఇప్పటివరకు వాటిని వినియోగంలోకి తీసుకు రాలేదన్నారు. రూ.15.50లక్షల నిధులపై విచారణ జరిపి పాఠశాల ఎస్‌వో హరితపై చర్యలు తీసుకొని విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.

పోలీసులకు నగదు పురస్కారాలు



నగదు పురస్కారం అందజేస్తున్న ఏసీపీ

చెన్నూర్: స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ భూమన్న, రవిలతో పాటు హోంగార్డు ఖాదీర్‌లు ఉత్తమ సేవలందించినందుకు గాను సోమవారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నగదు పురస్కారాలు అందజేశారు. వీరు సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను పట్టుకోవడంతో ప్రతిభ కనబర్చినందుకు నగదు ప్రోత్సాహకాలను అందజేసినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్ సీఐ రవీందర్, ఎస్సై శ్వేత పాల్గొన్నారు.

ఏజీపీకి సన్మానం



సన్మానం చేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మున్సిఫ్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా నియామకమైన వేల్పుల సత్తయ్యను మండలంలోని అంబేద్కర్ సంఘం నాయకులు సోమవారం స్థానిక గురునానక్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు రాజు, లచ్చన్న, రవి, నర్సయ్య, పురుషోత్తం, శ్రీధర్, రవీందర్, సత్తయ్య, రమేష్, లింగన్న, నరేష్, విక్రమ్, రాజేశ్, సందీప్, సుధాకర్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలు అరికట్టాలి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు జోన్‌లలో విచ్చలవిడిగా గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తూ యువతను చెడు మార్గంలోకి లాగుతున్నారని వారిని గుర్తించి గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలని మందమర్రికి చెందిన మహిళలు బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బత్తు సరిత, కొడారి శ్రీలత, దాసరి సమత ఉన్నారు.

విధుల్లో చేరిన ఎస్సై సనత్‌కుమార్

మంచిర్యాలక్రైం: ఇటీవల జరిగిన ఎస్సైల బదిలీల్లో భాగంగా గోదావరి–2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన సీహెచ్ సనత్‌కుమార్‌ను మంచిర్యాల మూడో ఎస్సైగా నియమిస్తూ ఈ నెల 6న సీపీ శ్రీనివాసులు ఉత్తర్వులు అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విధుల్లో చేరారు. అనంతరం మర్యాదపూర్వకంగా స్థానిక సీఐ బన్సిలాల్‌ను కలిసి మొక్కను అందజేశారు.

వనమహోత్సవం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

విద్యార్థులకు అవగాహన

జైపూర్: అన్ని సర్పాలు విషపూరితమైనవి కావని సర్పాలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కస్తూర్బాగాంధీ విద్యార్థులకు మందమర్రి స్నేక్ సొసైటీ, అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

విజేతలకు బహుమతులు

చెన్నూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బీజేపీ నాయకులు రత్న లక్ష్మీనారాయణరెడ్డి బహుమతులు అందజేశారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిరుపయోగం

- నిర్మించి ఏళ్లు గడిచినా ప్రారంభించని వైనం
- అందుబాటులోకి వస్తే ప్రకృతి వైద్యం, యోగాపై శిక్షణ
- ఆశ వర్కర్లను శిక్షకులుగా నియమించే యోచనలో ప్రభుత్వం



కోటపల్లిలో పీహెచ్‌సీ ఆవరణలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్

కోటపల్లి: ఏళ్లు గడిచానా హెల్త్ వెల్‌నెస్(ఆరోగ్యం స్వస్థత) కేంద్రాలు ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. ఫలితంగా ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యవేక్షణలో ఆయుష్ విభాగం కింద ఏర్పాటు చేశారు. యోగా శిక్షణ ద్వారా రోగాలు రాకుండా చూడటం, వస్తే త్వరగా నయం చేయడం, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యాన్ని అందించి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించేందుకు జిల్లా వ్యాప్తంగా 12ఆరోగ్య స్వస్థత కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేంద్రాల ఏర్పాటుకు రూ.72లక్షల వ్యయం...

యునాని, ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులకు అనుబంధంగా ఒక్కో కేంద్రానికి రూ.6లక్షల చొప్పున రూ.72లక్షలతో 12కేంద్రాలు ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో యోగా షెడ్, తాగు నీరు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించారు. దీర్ఘకాలిక బీపీ, షుగర్, ఆస్తమా, కీళ్ల నొప్పులు, వాపులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ, జీర్ణకోశ వ్యాధులు, పక్షవాతం తదితర వైద్యసేవలు అందించాలని నిర్ణయించారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంపై శిక్షణ యోగా, ఫిజియోథెరపీ, ఆరోగ్య సూత్రాలు సలహాలు ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించాలని భావించారు. కానీ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వైద్యసేవలు అందడంలేదు. అక్కడక్కడా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినా శిక్షణ, వైద్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు.

నిరుపయోగంగా....

జిల్లాలో మూడు యునాని, తొమ్మిది ఆయుర్వేద వైద్యశాలల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యునాని ఆరోగ్యకేంద్రం బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, జన్నారం, దేవాపూర్, చెన్నూర్, నెన్నల, కోటపల్లి, కన్నెపల్లి, తాండూర్, తపాలాపూర్, వేమనపల్లిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆయుష్ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం వైద్యులు, సిబ్బంది, మందుల కొరత వంటి సమస్యలతో వైద్యసేవలు పొందేందుకు ప్రజలు ముందుకు రావడంలేదు. కొన్ని ఆయుష్ వైద్యశాలలు, పీహెచ్‌సీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో సమస్యలను అధిగమించవచ్చని ప్రభుత్వం భావించింది. కానీ కేంద్రాలు ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

సిబ్బంది నియామకాలేవి?

ప్రతి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో యోగా శిక్షకుడు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఫార్మసిస్టు పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. యోగా శిక్షణ కేంద్రాలు నిర్మించి రెండేళ్లకాగా కాంట్రాక్టు పద్ధతిలో యోగా శిక్షకులను తీసుకోవాలని నిర్ణయించిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. తాజాగా ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చి యోగా శిక్షకులుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే...

ఆయుష్ ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేసిన హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చి, యోగా ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కేంద్రాలను ప్రారంభించి వైద్యసేవలు అందిస్తాం.

– డాక్టర్ నారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్, జన్నారం

అధికారుల తీరుపై కోణంపేట గ్రామస్తుల ఆగ్రహం

- విధులకు హాజరుకావడం లేదని సబ్‌సెంటర్‌కు తాళం
- ఎమ్మెల్యే, కలెక్టర్ గ్రామాన్ని సందర్శించకుంటే దీక్ష చేస్తామని హెచ్చరిక



కోణంపేట సబ్‌సెంటర్‌కు తాళం వేస్తున్న గ్రామస్తులు

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకోవడం లేదంటూ అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని నిరసిస్తూ సోమవారం హెల్త్ సబ్‌సెంటర్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. అధికారులు గ్రామానికి వచ్చి సమస్యలు పరిష్కరించకుంటే, ఆందోళన చేస్తామని ముందస్తుగా హెచ్చరించిన అధికారులు స్పందించలేరంటూ మండిపడ్డారు. అద్దె భవనంలో ఉన్న పల్లె ఆస్పత్రి తెరుచుకోవడం లేదని, అంగన్‌వాడీ సెంటర్‌ను ఇంటిలోనే నిర్వహిస్తున్నారని పాఠశాలలోకి మార్చాలని డిమాండ్ చేశారు. రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ పక్కా భవనంలో కార్యకలాపాలు నిర్వహించకుండా పంచాయతీ సిబ్బంది ప్రభుత్వ బడిలో పంచాయతీ కార్యాలయాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని అధికారులను ప్రశ్నించారు. వెంటనే పక్కా భవనంలోకి పంచాయతీ కార్యాలయాన్ని మార్చాలని పట్టుబట్టారు. రూ.2 కోట్లతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు భవనాలు నిర్మించినప్పటికీ ఇద్దరు ఉపాధ్యాయులు వంతుల వారీగా విధులు నిర్వహిస్తూ పాఠాలు సరిగ్గా బోధించకపోవడంతో 40మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుందని ఆరోపించారు. పాటి వాడలో పది మంది గిరిజన పిల్లలు బడికి దూరమై డ్రాపౌట్‌లుగా మిగిలిపోతున్నారన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని, కనీసం అత్యవసర పరిస్థితుల్లో 108అంబులెన్స్ సైతం రాలేని పరిస్థితి ఉన్న అధికారులు, నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్లు మా గ్రామాన్ని సందర్శించి సమస్యలకు పరిష్కార మార్గం చూపించాలని లేనిపక్షంలో గ్రామస్తులంతా కలిసి నిరాహారదీక్షలు చేపడతామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత నస్పూర్



టోర్నీ కప్‌తో నస్పూర్ జట్టు

నస్పూర్: పట్టణ పరిధిలోని కృష్ణాకాలనీ శాంతి స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ ఫైనల్ పోటీలలో నస్పూర్ జట్టు బెల్లంపల్లి జట్టుపై గెలిచి జిల్లా విజేతగా నిలిచింది. జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా నిర్వహించబడుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 12జట్లు టోర్నీలో పాల్గొనగా మొదటి స్థానంలో నస్పూర్ జట్టు, ద్వితీయ స్థానంలో బెల్లంపల్లి జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీ విజేతకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్, ప్రధాన కార్యదర్శి గని రవీందర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీపతి రవి, నాయకులు కనకయ్యగౌడ్, ముక్కెర శ్రీను, చిన్న సుధాకర్, నూనె సురేష్, సాంబారు రాము, సాయి, భాను ప్రకాశ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంచిర్యాలటౌన్: గత ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును విమర్శించే హక్కు లేదని, అసత్యపు ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆకాశరామన్న లేఖను మార్కెట్ రోడ్డులో వేయడంలో మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడు నడిపెల్లి విజిత్‌రావు హస్తం ఉందని, ఆ లేఖలపై పోలీసులు విచారణ జరుపుతున్నారని అన్నారు. భూ కబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే అనుచరుడు తాజాగా అరెస్టు అయ్యాడని, గోదావరి ఒడ్డున మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి, కోట్ల రూపాయల ప్రజాధనం దుబారా చేసి, గర్భినులకు ఉపయోగం లేకుండా చేసిన ఘనత వారిదేనన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత పీఎస్సార్ ఎన్నో అభివృద్ధి పనులను చేస్తూ, ప్రజలకు సేవా కార్యక్రమాలను అందిస్తుంటే, ఆయనపై నిందారోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రజా సేవతోపాటు మన్ననలు పొందడం ఎంతో గొప్ప

బెల్లంపల్లి: ప్రజాప్రతినిధులు ఐదేళ్ల పాటు సేవ చేయడం కన్నా ప్రజల మన్ననలు పొందడం ఎంతో గొప్ప అని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి శివారు కన్నాల పంచాయతీలోని తిరుమల హిల్స్‌లో సోమవారం తన స్వగృహం ఆవరణలో ఇటీవల పదవీ విరమణ చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు బీఆర్ఎస్ పక్షాన సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ప్రణయ్, జెడ్పీటీసీ సభ్యుడు బానయ్య, బీఆర్ఎస్ బెల్లంపల్లి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పోడు' రైతులపై వేధింపులు ఆపాలి



ఎఫ్‌డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: కోటపల్లి మండలంలో పోడు రైతులను అటవీ శాఖ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని, వేధింపులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కోటపల్లి మండల పార్టీ ఆధ్వర్యంలో చెన్నూర్ ఎఫ్‌డీవో రమేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కోటపల్లి మండలంలోని 16 గ్రామాలలో రైతులు పోడు భూములలో వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు ఫారెస్ట్ భూముల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఫారెస్ట్ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే వేధింపులు ఆపి రైతులు వ్యవసాయం చేసుకునేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోటపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు మంత్రి రామయ్య, మాజీ ఎంపీపీ మంత్రి సురేఖ, జాడి తిరుపతి, గర్రెపల్లి వెంకటనర్సయ్య, మండలంలోని పోడు రైతులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న హరికృష్ణ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. వార్డులో గత 20రోజులుగా విద్యుత్ దీపాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, లైట్లు పెట్టించాలని కోరారు. సాయికుంట చెరువు పనులు అసంపూర్తిగా వదిలేశారని, ఆయా పనులను త్వరగా పూర్తి చేయాలని, చున్నంబట్టి నుంచి సాయికుంట వరకు రోడ్డు పనులను అసంపూర్తిగా చేసి వదిలేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



చెన్నూర్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జన్నారంలో...



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



బెల్లంపల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి/చెన్నూర్/మందమర్రిరూరల్/జన్నారం: దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని కాంగ్రెస్ శ్రేణులు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి కేక్‌కట్ చేశారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి పేదల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. రైతులకు ఉచిత కరెంట్, పంట రుణమాఫీ, ఆరోగ్య శ్రీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, 108అంబులెన్స్, విద్యార్థులకు ఫీజు రీఎయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల హృదయాల్లో సుస్థిరస్థానం నిలబెట్టుకున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైఎస్సార్ అకాల మరణం ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు తీరని లోటు మిగిల్చిందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎం.చిన్నరాజం, ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు బండి రాము, ఎల్.శ్రీనివాస్, చెన్నూర్‌లో కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బాపగౌడ్, అంకగౌడ్, పాతర్ల నాగరాజు, చెన్నూరి రాజేశ్, మహేశ్, సుధాకర్‌రెడ్డి, కడవండి మహేశ్, మల్లక్క, ఈర్ల నారాయణ, జన్నారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజశేఖర్, పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు శుభాష్‌రెడ్డి, రియాజోద్దీన్, మందమర్రిలో కాంగ్రెస్, అనుబంధ నాయకులు, పలువురు మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందించిన దాతలు



మల్లేష్‌కు ఆర్థికసాయం అందిస్తున్న స్థానికులు

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ గ్రామానికి చెందిన బియ్యాల మల్లేష్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ దుస్థితిపై 'సాక్షి'లో 'దాతలు సహకరిస్తేనే వైద్యం' అనే శీర్షిక కథనం ప్రచురితం కాగా ఇబ్బందులను గుర్తించిన గ్రామానికి చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కలిసి రూ.50వేలు జమ చేశారు. వాటిని సోమవారం మల్లేష్‌కు స్థానికుల ద్వారా అందించారు.

సద్వినియోగం చేసుకోవాలి

భీమిని: ఉద్యానవన శాఖ నుంచి సబ్సిడీపై వచ్చే మొక్కలు, డ్రిప్ పరికరాలను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ అన్నారు. భీమిని మండలంలోని కేస్లాపూర్, వీగాం గ్రామపంచాయతీల్లోని ఆయిల్ పామ్ తోటలను, డ్రిప్ పరికరాలను సోమవారం పరిశీలించారు.

'ప్రజావాణి'కి స్పందన అంతంతే..!



వినతిపత్రం అందజేస్తున్న 108అంబులెన్స్ సిబ్బంది



భీమారం: పాల్గొన్న ఎంపీవో శ్రీపతిబాపురావు

వేమనపల్లి: ప్రజావాణికి స్పందన కరువైంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో అనిల్ కుమార్, తహసీల్దార్ రమేష్ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా ఎలాంటి అర్జీలు రాలేదు. పశువైద్యాధికారి అరుణ, ఏపీవో సత్యప్రసాద్, ఎంఎల్‌సీ కో ఆర్డినేటర్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భీమారంలో...

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా ఎంపీవో శ్రీపతిబాపు పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావాణి నిర్వహిస్తుందన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజావాణి దృష్టికి తీసుకురావాలని కోరారు.

రోడ్లపై పశువులు లేకుండా చూడాలని వినతి

కోటపల్లి: మండలకేంద్రంతో పాటు మల్లంపేట, ఎదులబంధం గ్రామాల్లో రోడ్లపైనే పశువులు ఉండటం వల్ల రాత్రి సమయంలో 108అంబులెన్స్ నడపడం ఇబ్బందిగా మారుతుందని 108అంబులెన్స్ సిబ్బంది సోమవారం ప్రజావాణిలో ఎంపీవో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. రోడ్లపైనే పశువులు కిలోమీటర్ల మేర పడుకోవడం వల్ల అత్యవసర సమయంలో వాహనం ఆపి ముందుకు వెళ్లాల్సి వస్తుందని, దీంతో రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లడం ఆలస్యం అవుతుందని తెలిపారు. ప్రధానంగా కోటపల్లి, వేమనపల్లి మండలాల అంబులెన్స్ రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి రోడ్లపైన పశువులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫరీద్ అహ్మద్, షబాజ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

కాసిపేట: మండలంలోని ఆదివాసీ గూడాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజావాణిలో ఆదివాసీ సంఘాల నాయకులు ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. గట్రావ్‌పల్లిలో ఉన్న సబ్‌సెంటర్ పనులు త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంత ఆదివాసీలకు వైద్యం అందించాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో తుడుందెబ్బ గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు, మడావి శంకర్, కోవ లింగు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు.

కర్షల ఘటంలో వైద్య శిబిరం

తాండూర్: మండలంలోని కర్షల ఘటం గ్రామంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన గిరిజనులకు మాత్రలు అందజేశారు.

ఆర్థిక సాయం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ అనాథ ఆశ్రమం ద్వారా పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థికి రూ.13వేల ఆర్థిక సాయం అందించారు.

మందమర్రిరూరల్: ఇటీవల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో తలిదండ్రులను కోల్పోయిన పట్టణంలోని రెండో జోన్ సరస్వతి శిశుమందిర్ సమీపంలోని చిన్నారులకు మందమర్రి అనుభవ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో రూ.10వేల నగదు సేకరించి సోమవారం చిన్నారుల ఇంటికి వెళ్లి అందించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తాండూర్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాన్నీ కాపాడుకోవాలని రాష్ట్రీయ బాల స్వస్తి కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) బృంద వైద్యుడు రామకృష్ణ అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

జైపూర్: మండలంలోని టేకుమట్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు.

పీహెచ్‌సీకి వాటర్ ఫిల్టర్ అందజేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థానిక ముస్లిం మైనార్టీ నాయకుడు ముస్తాఫా వాటర్ ఫిల్టర్ ను సోమవారం అందించాడు.

రక్తదాన శిబిరం

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ మంచిర్యాల సీనియర్ లయన్ మెంబర్ మేక వర ప్రసాద్, తన కుటుంబ సభ్యులతో పాటు 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899